ఏమయితేనేం, కావలసింది పేరు!

# కీర్తి ఆర్జనకు బైరాగి చిట్కాలు

"సహారా"

కథకుడు అప్పారావు పనుండి పిఠాపురం వెళ్ళాడు. పని చూస్తే చాలా అర్జంటయిన పని. వెళ్ళవలసినచోట్లకి వెళ్ళేడు. అయినా పని మాత్రం ఏమీ జరగలేదు. మళ్ళా పది, పదిహేనురోజుల్లో కనబడమన్నారు. ప్రాణం విసిగెత్తిపోయింది. మైండు అంతా పాడయిపోయింది. కాస్సేపు అలా వెళ్ళి పార్కులోనైనా కూర్చుందాం అని వెళ్ళేడు. పార్కులో కూర్చుని ఆలోచిస్తున్నాడు. ప్రక్కనున్న బెంచీలో ఎవరో ప్రక్కనున్న స్నేహితుడితో 'పోయినవారం 'లవిత్ర' చూసావా' అని అడుగుతున్నాడు. అప్పారావు త్రుళ్ళిపడి అటు చూసాడు. ఏమంటే, తన కథ ఒకటి అందులో పడింది. పోయినవారం 'లవిత్ర' సంగతి రాగానే దానిగురించి ఏమైనా వాళ్లు మాట్లాడితే బాగుణ్ణనుకున్నాడు, తన కథ గురించి కూడా ఏవేనా ఉద్దేశాలు వినబడతాయేమోనని చూస్తున్నాడు. ఇంతలో ఆ 'లవిత్ర' గురించి అడిగిన ఆయన ఇటుచూసి 'అందులో ఓ కథ ఉంది చూశావూ' అన్నాడు మళ్ళా స్నేహితుడితో.

స్నేహితుడు 'ఏమిటా కథ' అన్నాడు.

''బరువెక్కిన గుండె' అన్న కథ'' అన్నాడు ఆయన.

ఇదే అప్పారావు రాసిన కథ. ఏం వినబడుతుందో అని చెవులు నిక్కబెట్టి వింటున్నాడు అప్పారావు.

'ఆ! చూశాను, ఏమిటి నీ ఉద్దేశం' అన్నాడు స్నేహితుడు.

'ఏమిట్రా, వెధవ కథా అదీనూ, ఓ వరసా వావీ లేకుండా ఏడిసింది, థథ. బొత్తిగా అర్థం లేకుండా ఉంది.'

'అయితే మళ్ళీ ఒకసారి చదవాలి.'

'ఇంకెందుకులే, దాన్ని మళ్ళా చదవటం. ఎవడో ఉత్త ఫూల్ రాశాడు దాన్ని. దరిద్రగొట్టు ప్లాటూ వాడూనూ, అఘోరించినట్టే వుంది. రా, పోదాం, టైమయిపోయింది' అని, ఆవ్యక్తి, స్నేహితుణ్ణి లేవదీసుకుని పోయాడు.

ఇక అప్పారావుకి ఒళ్లు మండిపోయింది, తన వాళ్ళందరూ ఎంతో బాగుందని మెచ్చుకున్న కథను చెత్తకింద తీసిపారేస్తాడా వీడని. అసలు అప్పారావు పొద్దుట్నుంచీ వచ్చినపని అవక, ఒళ్లుమండి ఉన్నాడు. అపైన ఈ 'వ్యాఖ్య' అతనికి పుండుమీద కారం చల్లినట్టయింది. అక్కడో కుర్రాడుంటే, అతన్ని పిలచి ఆ 'వ్యాఖ్య' చేసిన వ్యక్తిని చూపించి 'అతనికేం పని' అని అడిగాడు. ఆ కుర్రాడు 'కథలు రాస్తాడు, మీకు తెలియదూ, వెంకట్రావు' అన్నాడు. 'ఓహో! అలాగా' అనుకున్నాడు అప్పారావు. గుండె గతుక్కుమంది అతనికి. ఏదో అనుకున్నాడు లోపల, ఏదో సణుక్కున్నాడు నోటిలో. తన ఊరు అమలాపురం వెళ్లిపోయాడు. వెళ్ళినదగ్గర్నుంచీ వెంకట్రావు 'ఆర్టికల్' ఏదైనా పడుతుందేమో అని చూస్తూనే ఉన్నాడు. ఇంతలో సడన్‌గా 'తమాషా' అనే పత్రికలో వెంకట్రావు రాసిన ఆర్టికల్ ఒకటి పడింది. 'దొరికాడురా' అనుకున్నాడు అప్పారావు. వెంటనే ఘాటుగా ఆ వ్యాసాన్ని ఎడాపెడా విమర్శించి, ఖండించి, ముక్కలు చేస్తూ, ఓ విమర్శ పంపించాడు. విమర్శ అచ్చయింది. ధనామని ప్రతివిమర్శ కూడా వచ్చేసింది. ఇంతలో కొందరు అప్పారావునీ మరికొందరు వెంకట్రావునీ వెనకేసుకుని రంగం మీదకు అవతరించారు. ఇక ఆ గ్రూపుకీ, ఈ గ్రూపుకీ వాదోపవాదాలు మొదలయినాయి. పత్రికా ప్రపంచమంతా ఊగిపోవడం మొదలు పెట్టింది. తమాషా' సంపాదకుడు ఏమాత్రమూ విసుగు లేకుండా ప్రచురిస్తూనే ఉన్నాడు విమర్శల్నీ, ప్రతి విమర్శల్నీ. అతనికూడా ఈ గొడవ

లాభదాయకంగానే ఉంది. అతని పత్రికలు తెగ ఖర్చయిపోతున్నాయి.

ఇది ఇలా ఉండగా అప్పారావు అలా కాలవగట్టుకు షికారుగా వెళ్ళేడు. అక్కడ 'రచనామండలి' ప్రెసిడెంటు జగ్గారావు కలుసుకున్నాడు. జగ్గారావు, అప్పారావు ఆప్త మిత్రుల్లో ఒకడు. అదీఇదీ మాట్లాడుకున్నాక 'ఏమిట్రా వెంకట్రావుకూ నీకూ వాదోపవాదాలు తెగ జరుగుతున్నాయి' అని ప్రశ్నించేడు జగ్గారావు.

'ఏడిశేడు వెధవ రాతలూ వాడూనూ. ఊరుకుంటూంటే ఇటువంటి చవట రచయితలందరూ తాడి ఎక్కి కూర్చుంటారు' అన్నాడు అప్పారావు.

'బాగానే ఉంది. ఇక ఎన్నాళ్ళకు మీరు మానటం?'

'వాడు తగ్గి ఊరుకునే దాకానూ'

'వాడు తగ్గడు'

'నీ కెలా తెలుసు'

'నాకు తెలియటమంటావేంటి, వాడికి దీని వల్ల పేరు వస్తూంటే, చచ్చిన వాదన మానేస్తాడూ'

'అనా, అలాగా' అప్పారావు.

'అలాగా, అని నాటక మాడతావేమిట్రా. నిజంచెప్పు వాడేమైనా నీకు ఉత్తరం రాశాడేమిటి'

'ఉత్తరమేమిటి'

'ఏడిశేవు, నాదగ్గిర దాచకు, నిజం చెప్పు'

'నాకేమీ అర్థమవటం లేదు'

'ఎలా అవుతుందిలే' అన్నాడు వెటకారంగా జగ్గారావు.

'ఇదేమిట్రా, ఏదో ఉత్తరం అంటావు. నన్ను చంపుకు తింటున్నావేమిటి'

'నిజంగా నీకు వాడేమీ ఉత్తరం రాయలేదూ?' సీరియస్‌గా అడిగేడు జగ్గారావు.

'నాకెందుకు రాస్తాడురా? వాడికీ నాకూ తగలడిపోతూంటే'

'అది కాదోయ్' 'తన్ను విమర్శించ'మని కానీ, పొగడమని కానీ ఏమీ రాయలేదూ'

'నీ తెలివి చచ్చినట్టే ఉంది. ఇదెక్కడి కథ అల్లుకు వచ్చావురా'

'అది కాదురా. నాకు ఓసారి ఓ ఉత్తరం రాశాడు వాడు'

'ఏమని?'

'రేపు చూపిస్తాగా' అని వెళ్ళిపోయాడు జగ్గారావు. మరునాడు తీసుకువచ్చి చూపించాడు. ఆ ఉత్తరంలో,

'రచనామండలి' ప్రెసిడెంటు జగ్గారావు గారికి, వెంకట్రావు రాసే ఉత్తరం:

నేను మీరు 'రచనామండలి' పెట్టారని విని చాలా సంతోషించాను. అలా మనలాంటి రచయితలందరూ సంఘాలూ, సమితులూ పెట్టుకుని అభివృద్ధి చెందాలని నా కోరిక. మీ ఆశయము చాలామంచిది. మీ మండలి అభివృద్ధిలోకి వస్తుందని ఆశిస్తున్నాను.

రచయితలు ఒకరికొకరు సహకరించాలి. ఈ సహకరించడం రెండు విధాలు. ఒకటి విమర్శించడం, రెండు పొగడడం. విమర్శించడం కూడా సహకరించట మెలా అవుతుందని మీరు అనుకోవచ్చు. ఉదాహరణకు ఒక సంగతి చెప్తావినండి. ఇప్పుడు నేనో రచన రాశాననుకోండి. దాన్ని మీరు నిర్దాక్షిణ్యంగా విమర్శించేయాలి. దాని వల్ల మనకు పత్రికల్లో ఒక రచ్చబండ ఏర్పడి వాదం జరుగుతుంది ఇందు మూలంగా మనిద్దరికీ పేరు వస్తుంది. మీరలా చేస్తారని నమ్ముతాను. మనమనం ఐకమత్యంగా ఉండాలి మీరు ఇంకో సహాయం చేయాలి మీరు నన్ను విమర్శించినా మీ సమితిలో మరొకరి చేత ఇంకో పత్రికలో, నా మరో రచనపై తెగపొగడ్తలు రాయించాలి. ఈ విధంగా పేరు నాకూ వస్తుంది. మీకూ వస్తుంది. ఈ మాత్రం ఉపకారం మీరు నాకు చేసి పెట్టాలి. ఈ రహస్యం నాలోనూ, మీలోనూ తప్ప ఇంకెవరికీ తెలియకూడదు.

దయయుంచాలి సెలవు,

'వెంకట్రావు.'

ఉత్తరం చదివేటప్పటికి అప్పారావు ఆలోచనలో పడ్డాడు. తను చాలా తొందరపనీ, పొరపాటు పనీ చేసేననుకున్నాడు. 'చూశావురా ఎలా రాసేడో. నీకేమీ అనుమానం వద్దు. ఇది వాడు తన లెటర్ పేడ్ మీద స్వంతంగా రాసిన ఉత్తరం. నీవు అనవసరంగా వాణ్ణి విమ

ర్శించి వాడికి పేరు తెచ్చేవు. ఇకనైనా మానెయ్. విమర్శించాలంటే వాడి రాతల్ని నేను ఎప్పుడో విమర్శించి ఉందును. ఈ భయంవల్లే నేను మానేశాను' అన్నాడు జగ్గారావు.

'ఇప్పుడయినా ఏమీ మించిపోలేదు, ఆ ఉత్తరం ఇలా తే' అని తీసుకున్నాడు అప్పారావు. వెంటనే దాన్ని 'తమాషా'కు పంపి అచ్చు వేయించాడు.

దాన్ని చూసాడు వెంకట్రావు. ఒళ్లు మండి పోయిందతనికి కాని ఏం చేస్తాడు. అయినా వెంటనే చిరునవ్వు తెచ్చుకున్నాడు. ఇంతలో అతని ఫ్రెండు ప్రకాశరావు వచ్చాడు 'ఏమిట్రా ఈ గొడవంతా వెంకట్రావ్' అని అడిగాడు.

'ఏముందిరా, నేను అసలు వేసింది ఒకప్లాను. కథ అడ్డం తిరిగింది. నేను ఒకసారి అమలాపురం వెళ్ళాను. అక్కడ వాళ్లొకరు అప్పారావుని చూపించారు. వాడోసారి మన ఊరు వచ్చాడు పార్కులో ఆవేళ మనం కూర్చున్న చోటనే వాడూ ఉంటే వాడు 'లచిత్ర'లో రాసిన 'బరువెక్కిన గుండె' అన్న కథను చెడా మడా తిట్టేశాను. జ్ఞాపకముందా?

'ఉంది. వాడని తెలిసీ ఎందుకు తిట్టేవు? నాకు తెలియదురా వాడావేళ అక్కడ ఉన్నాడని!'

'దానికి కారణం ఉందిలే. అలా తిట్టితే మనల్ని వాడు విమర్శిస్తాడనీ, అందువల్ల పేరు వస్తుందనీ చేశాను. అంతవరకూ బాగుంది. కాని ఇలా 'ఉత్తరం' ప్రకటిస్తాడని అనుకోలేదు.'

'అసలు నువ్వేనా ఆ ఉత్తరం రాసింది'

'నేనే'

'ఓరి పిడుగా! ఎలాగిప్పుడు? నిన్ను ప్రతీవాడు అసహ్యించుకుంటున్నాడు.'

'ఎలాగేమిటి? చూడు, దీనితో గమ్మత్తు చేస్తాను. దెబ్బతో అప్పారావు పని ఖతేక్.'

మరుసటి వారం 'తమాషా'లో అప్పారావుకు ఓ బహిరంగ లేఖ రాశాడు వెంకట్రావు:

అప్పారావుగారూ,

మీరు నేను జగ్గారావుగారికి ఆ ఉత్తరం రాసినట్టూ, దాన్ని మీరు ప్రకటిస్తున్నట్టూ ప్రకటించారు. నిజంగా ఆ ఉత్తరం నేను రాసినట్టయితే మీ మిత్రుడు చేయలేని ఉపకారం మీరు నాకు చేసిపెట్టేరన్న మాట. కాని ఒక విషయం చెప్తా వినండి. మీకు నా లెటర్ పేడ్‌లో కాగితం ఎక్కడ దొరికింది? దొరికితే దానిమీద ఎవరిచేత ఈఫోర్జరీ ఉత్తరం రాయించేరు? ఇలా నన్నూ, ప్రజల్నీ మోసం చేసి, (నన్ను అన్నారుగాని) ఏదో ఈ విధంగా పేరు తెచ్చుకుందామని ప్రయత్నించిన మిమ్మల్ని కోర్టులో నిలబెట్టించ దల్చుకున్నాను. మీకు నన్ను విమర్శించే శక్తిలేక, ఒక వైపునుంచి నా వ్యాసంమీద వాదన జరుగుతూనే ఉండగా, మీ బలహీనత వ్యక్తపరుచుకోవటానికి జడిసి, ఈ విధంగా (ఫోర్జరీ) ఉత్తరం ప్రకటిస్తూ 'ఇందువల్ల వాదన ఇకముందు 'నాతో' చేయ దల్చుకో లేదన్న' మీ బ్రతుకు చాలా విచారకరంగా పరిణమించింది.

ఈ రాసింది

మీ ప్రతికక్షి 'వెంకట్రావు

---

టర్కీలో మలల్యా అనేచోట, ఒక సిగరెట్ ఫ్యాక్టరీవుంది. అందులో ఫతిమా యుమత్ అనే 19 వత్సరాల పిల్ల వుంది. పెళ్లికాలేదు. ఆమెకో వుపాయం తట్టింది. అది క్రొత్తరకం స్వయంవరం. తన ఫోటో ఒకటి చిన్నది తీసి తను సిగరెట్లు నింపుతున్న ఒక పెట్టెలో పెట్టింది. 'ఈ పెట్టెకొన్న వ్యక్తి బ్రహ్మచారి అయితే నా యడ్రెసు ఇందులో వుంచుతున్నాను. వచ్చి వివాహం చేసుకోవచ్చు' నని వ్రాసింది. ఆ చీటికూడా అందులో పెట్టింది. మూడు వారాల తరువాత ఆ పెట్టెను అంకారాలో ఖాజీం అపరుద్దీన్ అనే బ్యాంకు గుమస్తా కొన్నాడు. అతని వయస్సు 22 వత్సరాలు. వెంటనే అతడు ఫాతిమా వద్దకు వచ్చాడు. ఆ అమ్మాయి, మాట తప్పకుండా వివాహమాడింది—('కృష్ణాపత్రిక' నుండి)